బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 16 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తెలంగాణ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకోనున్న సందర్భంగా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మానవ జీవితంలో భగవద్గీత బోధనలు అపారమైన ప్రభావం చూపుతాయని, జీవన ప్రతి దశలో కృష్ణ భగవానుడు స్ఫూర్తిగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. మహావిష్ణువు దశావతారాల్లో కృష్ణావతారం అత్యంత ప్రత్యేకమైందని, దుష్టసంహారంతో పాటు మానవాళికి అవసరమైన భగవద్గీతను అందించారని సీఎం గుర్తు చేశారు. కృష్ణ తత్వాన్ని సరిగ్గా అవగాహన చేసుకుంటే జీవనంలోని ప్రతి రంగంలో విజయం సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలందరిపైనా కృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



# న్యూక్లియర్ బెదిరింపులకు భయపడం

- పహల్గాం దాడికి 'ఆపరేషన్ సిందూర్'తో సమాధానం
- త్రివిధ దళాలకు సంపూర్ణ స్వేచ్ఛ
- లక్ష్యం, సమయం ఎంచుకునే అధికారం సైన్యానికే
- ఉగ్రవాదాన్ని సమర్థించే వారినీ సహించం
- ఇండస్ జలాలపై భారత్‌కే హక్కు
- ప్రధాని మోడీ
- ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఆవిష్కరణ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై త్రివర్ణ పతకాన్ని ఎగురవేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అనంతరం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్న ఆపరేషన్ సిందూర్‌లో వీర జవాన్లు ప్రదర్శించిన ధైర్యసాహసాలను కొనియాడారు. వీరులకు సెల్యూట్ చేసే అవకాశం దక్కడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు.

**త్రివిధ దళాలకు సంపూర్ణ స్వేచ్ఛ**

"పహల్గాంలో మతంపేరుతో అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాం. ఈ ఆపరేషన్‌లో త్రివిధ దళాలకు లక్ష్యం, సమయం ఎంచుకునే సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చాం. మన సైనికులు శత్రువులను ఊహకందని స్థాయిలో దెబ్బతీశారు" అని మోదీ తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దారుణంపై దేశం మొత్తం ఆగ్రహం వ్యక్తం చేసిందని, అదే ఆవేశం నుంచి 'ఆపరేషన్ సిందూర్' పుట్టిందని చెప్పారు. శత్రు భూభాగంలోకి వందల కిలోమీటర్ల దూసుకెళ్లి ఉగ్రస్థావరాలను మట్టిలో కలిపిన ఘనత మన సైనికదే అన్నారు. "ఈ దాడితో పాక్‌కి నిద్రపట్టడం లేదు. అక్కడ ఎంత భారీ నష్టం జరిగిందో రోజుకో కొత్త సమాచారం బయటపడుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు.

**న్యూక్లియర్ బెదిరింపులకు లొంగము**

ఉగ్రవాదం, దాన్ని సమర్థించే వారిని వేర్వేరుగా చూడబోమని మోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికే ముప్పు అని, ఎలాంటి బెదిరింపులకూ భారత్ భయపడదని తేల్చిచెప్పారు. "శత్రుమూకలను ఎప్పుడు, ఎలా మట్టుబెట్టాలో సైన్యమే నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు.

**ఇండస్ జలాలపై భారత్‌కే హక్కు**

భారత్ వాటా ఇండస్ నది జలాలపై దేశానికీ, దేశ రైతులకే హక్కు ఉందని, ఇండస్ జల ఒప్పందం అన్యాయం, ఏకపక్షమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఒప్పందం కొనసాగింపుకి "భారత్ నిర్ణయించుకుంది – రక్తం, నీరు కలసి ప్రవహించవు. నా దేశ భూమి దాహంతో ఉంటే, మన భూభాగం నుంచి పుట్టే నదులు శత్రు పొలాలను పండించలేవు. మన రైతుల కోసం, మన జలాలను మనమే వినియోగించుకుంటాం" అని మోదీ హెచ్చరించారు. ఈ ఒప్పందం కారణంగా దశాబ్దాలుగా భారతీయ రైతులు ఊహించలేనంత నష్టం చవిచూశారని మోదీ చెప్పారు. "దశాబ్దాలుగా భరించాం. ఇక భరించము. రైతుల ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం ఈ ఒప్పందం మాకు ఆమోదయోగ్యం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణను

# నెంబర్ 1గా నిలబెడతాం

- రైతులకు రూ. 20,616 కోట్లు రుణమాఫీ
- 9 రోజుల్లో రూ.9,000 కోట్లు జమ
- సన్నబియ్యం పంపిణీపై రూ. 13,000 కోట్లు వ్యయం
- 3,500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 22,500 కోట్లు కేటాయింపు
- 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు - లక్షలాది ప్రైవేటు అవకాశాలు
- కృష్ణ-గోదావరి జలాల్లో వాటా సాధనలో రాజీ ఉండదు
- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ డిసెంబర్‌లో
- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండలో జాతీయ పతాకావిష్కరణ

## అభివృద్ధి, సంక్షేమం అన్న ద్విముఖ విధానంతో ప్రభుత్వం పాలన



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రానికి ఉన్న ఆర్థిక భారాన్ని అధిగమించి ప్రపంచ వేదికపై తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "మనసుంటే మార్గం ఉంటుందన్న సూక్తిని బలంగా విశ్వసిస్తాను. మాకు సంకల్పం ఉంది. అందుకు అవసరమైన విజన్ ఉంది. ఆర్థిక భారం ఉన్నప్పటికీ శూన్యం నుంచి ఉన్నత శిఖరానికి రాష్ట్రాన్ని తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నాం. ప్రజల అండతో లక్ష్యం చేరుకునే వరకు విశ్రమించం.." అని గోల్కొండ వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గోల్కొండ రాణిమహల్ లాన్స్‌లో ముఖ్యమంత్రి గారు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, సమ్మాన్ గార్డ్స్ కవాతు అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు నుంచి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు తెలంగాణ సమగ్రాభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికను ఆవిష్కరించారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్న లక్ష్య సాధన కోసం పనిచేద్దామని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు. "అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నాం. రైతులు, మహిళలు, యువత భవితకు పెద్దపీట వేశాం. సామాజిక తెలంగాణ ఆవిష్కరణకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. కుల గణనతో బలహీన వర్గాల వందేళ్ల కలను నిజం చేశాం. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల నిరీక్షణకు తెరదించాం.

అభివృద్ధి, సంక్షేమం అన్న ద్విముఖ విధానంతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. అందరినీ కలుపుకుని అద్భుతాలు సృష్టించే సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని ప్రజా ప్రభుత్వం ఎంచుకుంది. పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ 20 నెలల కాలంలో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలబెట్టాం. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి 8,21,651 కోట్ల అప్పులు, బకాయిలు ఉండగా, అందులో 6,71,757 కోట్ల అప్పు.. ఉద్యోగులు, ఇతర పథకాలకు సంబంధించిన బకాయిలు 40,154 కోట్లు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, సింగరేణి, విద్యుత్, ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు 1,09,740 కోట్లు ఉండగా, వాటిపై అసలు రూపేణా 1,32,498 కోట్లు, వడ్డీ రూపేణా 88,178 కోట్లు మొత్తం కలిపి 2,20,676 కోట్ల రూపాయల డెట్ సర్వీసింగ్ చేసాం.

పేద ప్రజల ఆహార భద్రతకు భరోసాగా ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించాం. 13 వేల కోట్ల రూపాయల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేపట్టాం. నిరుపేదల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే మిగిలా 2వ పేజీలో

### సరైన ప్రణాళికలతో ముందుకొస్తే సహకరిస్తాం

- రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి, పట్టుదల, ఓపిక, సహనం ఉన్నాయి
- సర్కారు పాలసీ, నిర్మాణరంగం గ్రోత్ ఇంజిన్స్
- రాజకీయ నేతల అపోహలతో నష్టపోవద్దు
- విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నోళ్లం.. మిమ్మల్ని వదులుకుంటామా?

వివరాలు 2వ పేజీలో

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో సీఎం రేవంత్‌రెడ్డి

## 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో

# కేసీఆర్‌లా పాలించిన నాయకుడు ఒక్కరూ లేరు



- కాంగ్రెస్, టీడీపీ పాలనలో పడావుబడ్డ తెలంగాణను పదేండ్లలోనే నెంబర్ వన్ గా కేసీఆర్ మార్చారు..
- త్రెలంగాణ పేరు ఎత్తడమే పాపమైన రోజుల్లో పార్టీ పెట్టడం దుస్సాహసమే..
- పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పును కేవలం 20 నెలల్లోనే రేవంత్ రెడ్డి చేసిండు..
- ప్రజా యోధుడు పుస్తక ఆవిష్కరణ సభలో కేటీఆర్..

**బలగం టీవీ, హైదరాబాద్**

79 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో కేసీఆర్ లా పాలించిన నాయకుడు మరొకరు లేరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు అన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో వెనుకబడిన తెలంగాణను కేసీఆర్ పదేళ్లలో అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా మార్చారని ఆయన పేర్కొన్నారు. మహేంద్ర తోటకూరి రచించిన 'ప్రజా యోధుడు' పుస్తకావిష్కరణ సభలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించే సన్నాసులకు 25 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఉన్న పరిస్థితులు తెలియవన్నారు. తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అయిన చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతున్న సమయంలో ప్రత్యేక పార్టీ పెట్టడం దుస్సాహసమని అన్నారు. 'శూన్యం నుంచి సునామీని సృష్టించినట్టుగా' తెలంగాణ రానే రాదన్న అనుమానాలను పటాపంచలు చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కారణజన్ముడు కేసీఆర్ అని కొనియాడారు. "తల్లికి జన్మనిచ్చిన తనయుడు" అని ప్రజాకవి గోరటి వెంకన్న కేసీఆర్‌ను ప్రశంసించడం ఏమాత్రం అతిశయోక్తి కాదని కేటీఆర్ చెప్పారు.

కేసీఆర్ అప్పులు చేశారని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ రెడ్డి వరకు చేస్తున్న తప్పుడు ప్రచారానికి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వమే చెంప దెబ్బ లాంటి సమాధానం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం కేవలం ?2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని సాక్షాత్తు మోడీ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ప్రభుత్వాన్ని నడపడం చేతకాక, ఇచ్చిన హామీలను అమలు చేయలేక, అప్పుల పేరుతో కేసీఆర్‌ను కాంగ్రెస్ బద్నాం చేస్తుందని విమర్శించారు.

ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, తెలంగాణ ఖ్యాతిని హిమాలయాల ఎత్తుకు తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్ అన్న కేటీఆర్, వ్యవసాయంలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను నంబర్ వన్ స్థానానికి తీసుకొచ్చారని తెలిపారు. భారతదేశంలో మొదటిసారి ఇంటింటికి నల్లానీళ్లు ఇచ్చి ఆడబిడ్డల కష్టాన్ని తీర్చడం తో పాటు నల్గొండలో ఫ్లోరోసిస్ మహమ్మారిని శాశ్వతంగా తుడిచిపెట్టిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, మిగిలా 2వ పేజీలో

# బంగాళాఖాతంలో అల్పపీడనం

- 14 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్‌లో అతి భారీ వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో, రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న అల్పపీడనం మరింత బలపడి ఒడిశా వైపు కదులుతోందని, దీని ప్రభావం తెలంగాణపై స్పష్టంగా కనిపిస్తుందని తెలిపింది.

**రెడ్ అలర్ట్ జారీ**

నల్గొండ, యాదాద్రి–భువనగిరి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకూడదని, బయటకు వెళ్లినపుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఓట్ల చోరీ జరిగితే

# వాళ్లకు అన్ని సీట్లు ఎలా వచ్చాయి

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొద్ది రోజులుగా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాజాగా ఈ అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఓట్ల చోరీకి, బిజెపికి ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. యూసుఫ్‌గూడలో బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాంచంద్ర రావుతో కలిసి ఆయన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఓట్ల చోరీ జరిగితే ఇండి కూటమికి 230 ఎంపి సీట్లు వచ్చేవా? బిజెపికి 240 ఎంపి సీట్లు మాత్రమే ఎందుకు వచ్చాయి. ఓట్ల చోరీ జరిగితే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచేదా? ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది" అని అన్నారు.

# నాగాలాండ్ గవర్నర్ గణేశన్ కన్నుమూత



**బలగం టీవీ, హైదరాబాద్**

నాగాలాండ్ గవర్నర్ గణేశన్ శుక్రవారం కన్నుమూశారు. ఈ నెల 8వ తేదీన కిందపడి గాయాలు అయిన 80 సంవత్సరాల గణేశన్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన కోలుకోలేకపొయ్యారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 1945లో తంజావూర్‌లో జన్మించిన గణేశన్ చిన్ననాటనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులు అయ్యారు. సంఘ్ కార్యకర్తగా చురుగ్గా వ్యవహరించారు. 1991లో తమిళనాడు బిజెపిలో చేరిన గణేశన్ పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేసేందుకు పాటుపడుతూ వచ్చారు. మధ్యప్రదేశ్ నుంచి బిజెపి కోటాలో రాజ్యసభ సభ్యులుగా వ్యవహరించారు. తరువాత ఆయనను ముందుగా మణిపూర్ గవర్నర్‌గా నియమించారు. 2022లో బెంగాల్ అదనపు గవర్నర్ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. 2023 ఫిబ్రవరి నుంచి నాగాలాండ్ గవర్నర్‌గా ఉంటూ వస్తున్నారు. నాగాలాండ్ గవర్నర్ మృతి పట్ల ప్రధాని మోడీ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన నిబద్ధత, అంకితభావపు జాతీయవాది అని స్పందించారు. తమిళనాడులో బిజెపి బలోపేతానికి అకుంఠిత దీక్షతో పాటుపడ్డారని కొనియాడారు.

# మాజీ సీఎం కేసీఆర్ కీలక భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, మాజీ మంత్రి టి. హరీష్‌రావు సహా కీలక నేతలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎర్రవెల్లి నివాసంలో జరిగిన ఈ భేటీలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు సాధనే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా, స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కూలిపోయిందన్న వ్యాఖ్యపై విశ్లేషణ జరిగింది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు నేపథ్యంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశంపై కూడా కూలంకషంగా చర్చించినట్లు సమాచారం.

# ఈసారి 'డబుల్ దీపావళి'..

- కొత్త జీఎస్టీ బహుమతి
- ప్రధాని మోడీ



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశ ప్రజలకు ఈ దీపావళి డబుల్ సంతోషం అందించబోతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట ప్రాకారాలపై నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, "ఈ దీపావళికి మీకు పెద్ద బహుమతి ఇస్తాను. 'నెక్స్ట్ జనరేషన్' జీఎస్టీ సంస్కరణలను తీసుకొస్తున్నాం. దీని వల్ల పన్నుల భారం తగ్గి, సాధారణ ప్రజలకు ఉపశమనం లభిస్తుంది" అని తెలిపారు.

ఎనిమిదేండ్ల క్రితం దేశవ్యాప్తంగా అమలైన జీఎస్టీ వ్యవస్థతో అనేక పన్నులు, స్థానిక లేవీలు రద్దయి పన్ను విధానం సులభతరమైందని గుర్తుచేశారు. జూలై 1, 2017న అమలులోకి వచ్చిన ఈ పరోక్ష పన్ను విధానం ఎనిమిదేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సమీక్ష చేపట్టామని, రాష్ట్రాలతో సంప్రదింపుల అనంతరం కొత్త సంస్కరణల రూపకల్పన పూర్తయిందని చెప్పారు.

కొత్త జీఎస్టీ సవరణలతో సాధారణ వినియోగ వస్తువులపై పన్నులు గణనీయంగా తగ్గుతాయని, ఎంఎస్ఎంఈలకు పెద్ద మేలు జరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. "రోజువారీ అవసరాల వస్తువులు చవకవుతాయి. దీంతో ఆర్థిక వ్యవస్థకు బలపడుతుంది" అని తెలిపారు.

అదేవిధంగా, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్లాట్‌ఫారమ్‌ను ప్రపంచం ఆశ్చర్యంగా చూస్తోందని మోదీ అభిప్రాయపడ్డారు. "ప్రపంచంలో 50% రియల్‌టైమ్ లావాదేవీలు భారత్‌లోనే యూపీఐ ద్వారా జరుగుతున్నాయి. మన సృజనాత్మక ప్రపంచం, సోషల్ మీడియా ఎందుకు మనదిగా ఉండకూడదు? ఎందుకు ఇతరులపై ఆధారపడాలి? మన సంపద ఎందుకు దేశం వెలుపలికి వెళ్లాలి? మీ ప్రతిభపై నాకు విశ్వాసం ఉంది" అని యువతను ఉద్దేశించి పిలుపునిచ్చారు.

# చిక్కడపల్లిలో 36 తులాల చోరీ

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఒక అపార్ట్‌మెంట్‌లోని భారీ చోరీ జరిగింది. మరమ్మతులు జరుగుతున్న ఓ ఫ్లాట్‌లో డోరు తెరిచి ఉండటంతో లోపలికి వచ్చిన దొంగ బీరువాలో ఉన్న 36 తులాల బంగారం, రూ.35 వేలు ఎత్తుకెళ్లాడు. పూర్తి వివరాల్లోకెళ్తే.. వివేక్‌నగర్ త్యాగరాయగానసభ సమీపంలోని దిట్టకవి ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో డి.నారాయణ అనే మిధాని కంపెనీ విశ్రాంత ఉద్యోగి నివాసం ఉంటున్నాడు. సదరు ఫ్లాట్ ప్రధాన ద్వారం తలుపులకు చెదలు పట్టడంతో కొత్త తలుపులు బిగించడానికి పనులు జరుగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఏదో శబ్దం వినిపించి నారాయణ బయటకు వచ్చి చూశాడు. నిద్రపట్టక మళ్లీ రెండు సార్లు బయటకు వచ్చి చూసిన ఆయన మూడోసారి మరమ్మతులో ఉన్న తలుపులకు గొళ్లెం వేయడం మరిచిపోయి పడుకున్నాడు. అదే సమయంలో అపార్ట్‌మెంట్ వెనుక వైపు నుంచి ఒక అగంతకుడు ఇంటి లోపలికి వచ్చాడు. బీరువా తాళాలు దానికే ఉండటంతో 36 తులాల బంగారం, రూ.35 వేలు దోచుకెళ్లాడు. ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు దొంగతనం జరిగినట్టు గుర్తించి చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, డీఐ శంకర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికివచ్చి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు ఆధారాలు సేకరించడంతో పాటు సీసీ కెమెరాలను తనిఖీ చేసి అగంతకుని కోసం దర్యాప్తు చేపట్టారు. కాగా, వెంటనే రంగంలోకి దిగిన చిక్కడపల్లి పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించి మధ్యాహ్నానికి పట్టుకుని బంగారం, నగదును రికవరీ చేసినట్టు సమాచారం.

# సరైన ప్రణాళికలతో ముందుకొస్తే సహకరిస్తాం

- క్రెడాయ్ ప్రాపర్టీ షోలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

అపోహలు, అనుమానాలతో ముందుకు వెళితే అభివృద్ధి సాధించలేమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి, పట్టుదల, ఓపిక, సహనం తనకున్నాయని, అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, "కొందరు కావాలని సృష్టించే అపోహలు, అనుమానాలకు మరింత ఊతమిస్తే అంతిమంగా వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుంది.

ప్రజలకు ఉపయోగపడే విధంగా రియల్ ఎస్టేట్ రంగంలో సరైన ప్రణాళికలతో ముందుకొస్తే తప్పకుండా సహకరిస్తాం. దాన్ని ఒక చాలెంజ్‌గా తీసుకుంటాను. తెలంగాణలో పెట్టుబడుల కోసం అమెరికా, జపాన్, కొరియా, దుబాయ్ లాంటి దేశాల్లో రోడ్ షోలు నిర్వహిస్తూ, విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తున్నప్పుడు, ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి ఈ నగరం కోసం, ఈ దేశ అభివృద్ధి కోసం పెట్టుబడులతో ముందుకొస్తే మిమ్మల్ని ఎందుకు వదులుకుంటాం.

రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి హైదరాబాద్‌ను, తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి మీకున్న ఆలోచనలను పంచుకోండి. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిని ఫణంగా పెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకు ఒడిగట్టే ప్రశ్నే లేదు. అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ పాలసీ, మౌలిక సదుపాయాలు.. రెండూ ముఖ్యం. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు చేస్తుంది. ఆ నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. పైగా ప్రజలకు అందుబాటిలో ఉండాలి. అలా ఉన్నప్పుడే పెట్టుబడులు ఆకర్షించి అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లగలం. మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఆరోజు జైపాల్ రెడ్డి గారు మెట్రో రైలు తీసుకురాకపోయి ఉంటే ఈరోజు ఆ సేవలు ఉండేవా. అయితే గడిచిన కొన్నేళ్లుగా మెట్రో విస్తరణ చేపట్టకపోవడం వల్ల నష్టం జరిగింది. మెట్రోను విస్తరించి ఉంటే ఈ ట్రాఫిక్ జామ్ సమస్య కొంతైనా తీరేది. ఎల్టీ యుటిలిటీ ట్రాన్స్‌పోర్టేషన్ ఎప్పుడూ జన సాంద్రత ఉన్న ప్రాంతాల్లో ఉండాలి. అందుకే మెట్రోను నాగోల్ నుంచి ఎల్బీనగర్ – చాంద్రాయగుట్ట మీదుగా శంషాబాద్ వరకు ప్రతిపాదించాం. మరోవైపు ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు, కూకట్‌పల్లి నుంచి పటాన్‌చెరు వరకు, హైటెక్ సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి నియోపోలిస్ వరకు విస్తరణ చేయాలని సంకల్పించాం.

ఇండస్ట్రియల్ కారిడార్ అనుమతి ఇవ్వమని కోరాం. తొందరలోనే అనుమతులు రాబోతున్నాయి. ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాల్సింది ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వమే. గ్రాంట్లు, పథకాలు, నిధులు, అనుమతులు ఇవ్వాలంటే ఢిల్లీకే వెళ్లాలి. గత పదేళ్ల కాలంలో కంటోన్మెంట్ భూమి ఇంచు కూడా సాధించలేదు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం ఢిల్లీకి వెళ్లి అనుమతులు తెచ్చాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై 1 లక్ష కోట్ల రూపాయల అప్పు చేశారు. అది కూడా 12 సంవత్సరాల కాలంలో తిరిగి చెల్లించేలా 11.50 శాతం వడ్డీకి అప్పు తెచ్చారు. అంత వడ్డీకి అప్పు చేస్తామా. అప్పు చెల్లిస్తూ ఇప్పటికే 3 సంవత్సరాలు అయిపోయింది. ఇప్పటికే ప్రభుత్వం 29 వేల కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ విషయంలో ఢిల్లీకి వెళ్లి రుణాలను రీస్ట్రక్చర్ చేయమని కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే విజ్ఞప్తి చేశాం. మొదటి దశలో 26 వేల కోట్ల రూపాయల రుణాన్ని 35 సంవత్సరాలకు రీస్ట్రక్చర్ చేయడమే కాకుండా వడ్డీని 7.5 కు తగ్గించాం. ఇదే రకంగా 2 లక్షల కోట్ల రూపాయల రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని అడుగుతున్నాం. అప్పులు నెత్తిమీద ఉంటే ఎవరైనా వ్యాపారంలో రాణించగలరా. మెట్రో విస్తరణ కావాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతులు కావాలి. చీటికి మాటికి ఢిల్లీ వెళుతున్నారని కొందరు రాద్ధాంతం చేస్తున్నారు. ఢిల్లీ వెళ్లకుండా అనుమతులు ఎలా వస్తాయి.

పక్క రాష్ట్రాల్లో ఎన్నో విమానాశ్రయాలు ఉండగా, తెలంగాణలో ఒకే ఒక ఎయిర్‌పోర్టు ఉంది. తెలంగాణకు రెండో ఎయిర్‌పోర్టు అవసరం లేదా. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు రెండింటికీ అనుమతులు తెచ్చాం. పెట్టుబడుల గురించి అడిగినప్పుడు కనెక్టివిటీ గురించి అడుగుతున్నారు. ఎయిర్‌పోర్ట్ వస్తే పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలొస్తే అభివృద్ధి సాధించగలం. 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రైల్, డ్రైపోర్టు వంటివి కేంద్రాన్ని అడిగాం. ఓఆర్ఆర్‌కు రీజినల్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా 11 రేడియల్ రోడ్లకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. శాటిలైట్ సిటీలు నిర్మించాలన్న ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. విజన్ డాక్యుమెంట్ గమనిస్తే తెలంగాణ సమ్మిళిత అభివృద్ధిని చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణ అని మూడు ప్రాంతాలుగా రాష్ట్ర సమగ్ర స్వరూపం ఉంటుంది. కోర్ అర్బన్‌లో సర్వీస్ సెక్టర్, సెమీ అర్బన్‌లో ఇండస్ట్రియల్ సెక్టర్, రూరల్‌లో అగ్రికల్చర్ సెక్టర్ ఉంటుంది. ఇలా మూడు రకాలుగా ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నప్పుడు మీ పెట్టుబడులకు ఆ రకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి హైడ్రా తెచ్చినప్పుడు కూడా కొందరు అపోహలు సృష్టించి అపవాదు వేయడానికి ప్రయత్నించారు. చెరువులు, నాలాలను ఆక్రమణలను తొలగిస్తే నాకేమైనా సొంత లాభం ఉంటుందా. విజ్ఞతతో ఆలోచించండి. తెలంగాణ కోసం వేస్తున్న ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది మీరే. ఇంకా మెరుగ్గా చేయడానికి సలహాలుంటే ఇవ్వండి. హైదరాబాద్‌ను అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దుతా. భవిష్యత్తులో వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేద్దాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ంది

# 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో కేసీఆర్‌లా పాలించిన నాయకుడు ఒక్కరూ లేరు

(మొదటి పేజీ తరువాయి)

నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన ఏ ఒక్క ముఖ్యమంత్రికి రాలేదన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు పథకం పెట్టి ?73 వేల కోట్లను 70 లక్షల మంది రైతులకు అందించిన ఒకే ఒక్క నాయకుడు స్వతంత్ర్య భారత చరిత్రలో కేసీఆర్ ఒక్కరే అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఎదుర్కొని అత్యద్భుతంగా పనిచేసిన నాయకుడిని బద్నాం చేస్తున్న కాంగ్రెస్ చిల్లర ప్రయత్నాలను తిప్పికొట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహేంద్ర తోటకూరి రచించిన 'ప్రజా యోధుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వ పటిమను, తెలంగాణ సాధనలో ఆయన పడ్డ కష్టాన్ని గుర్తు చేసుకున్నారు. 2004లో తాను భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత జయశంకర్, విద్యాసాగర్, కేసీఆర్ వంటి వారితో గడిపిన రెండేళ్ల కాలంలో తెలంగాణ ఉద్యమ చరిత్రపై అవగాహన పెంచుకున్నానని కేటీఆర్ తెలిపారు. 25 ఏళ్ల క్రితం తెలంగాణలో పార్టీ పెట్టడం, రాష్ట్రాన్ని సాధిస్తామని చెప్పడం దుస్సాహసంతో కూడుకున్నదని అన్నారు. ఆ రోజుల్లో కేంద్రంలో వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, తెలంగాణకు వ్యతిరేకి అయిన చంద్రబాబునాయుడు ఎన్‌డీఏ కన్వీనర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారని ఆయన గుర్తుచేశారు.

"ఎన్టీఆర్, ఎంజీఆర్ లాగా కేసీఆర్ సినిమా స్టార్ కాదు. ఆయనకు కుల బలం, ధన బలం, మీడియా పవర్, బలగం ఏమీ లేవు. అలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను తట్టుకొని పార్టీ పెట్టి, రాజకీయ లక్ష్యాలను సాధించాలంటే ఎంత కష్టమో ఊహించుకోండి" అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఒక సాధారణ నాయకుడు కాదని, 'శూన్యం నుంచి సునామీని సృష్టించిన నాయకుడు' అని ఆయన ప్రశంసించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను భారత పార్లమెంట్‌కు చేరేలా ఉద్యమ నిర్మాణం చేయడం ఆషామాషీ వ్యవహారం కాదని చెప్పారు. 'తల్లికి జన్మనిచ్చిన తనయుడు' అని ప్రజాకవి గోరటి వెంకన్న కేసీఆర్‌ని ప్రశంసించడం ఏ మాత్రం అతిశయోక్తి కాదని కేటీఆర్ అన్నారు. 2001 నుంచి 2014 వరకు కేసీఆర్ పడ్డ కష్టం ముందు ఇప్పుడున్న కష్టాలు ఏమాత్రం కాదని కేటీఆర్ అన్నారు. ఆ సమయంలో ఎన్నో ప్రతికూల శక్తులు అడ్డంగా ఉన్నా, దుర్మార్గమైన రాజకీయ వ్యవస్థ పార్టీని అణచివేయాలని చూసినా, తెలంగాణను నడిపే సామర్థ్యం ఉందా అని అవహేళన చేసినా కేసీఆర్ ఒక్కరే ధైర్యంగా నిలబడ్డారని ప్రశంసించారు.

తెలుగు సినిమాల్లో తెలంగాణ భాష, యాసను కేవలం జోకర్లు, విలన్లకు మాత్రమే ఉపయోగించిన పరిస్థితుల్లో తెలంగాణ కోసం పోరాడాలంటే గొప్ప తెగింపు ఉండాలని కేటీఆర్ చెప్పారు. "నేను ఎత్తిన జెండా దించితే రాళ్లతో కొట్టి చంపండి" అని 2001లో జరిగిన సింహగర్జనలో కేసీఆర్ ప్రజలకు చెప్పిన మాటను గుర్తు చేస్తూ, అలాంటి గుండె ధైర్యం కేసీఆర్‌కు మాత్రమే ఉందని అన్నారు. "కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో" అనే సంకల్పం కూడా ఆయనకే సొంతమన్నారు.తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని పునర్నిర్మించారని, పల్లెలు, పట్టణాలు ఎలా ఉండాలో ముందుగానే ఆలోచించారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ సాధించిన తర్వాత ఆ రాష్ట్రానికే ముఖ్యమంత్రి కావడం అందరికీ దక్కే అదృష్టం కాదని, ప్రణబ్ ముఖర్జీ వంటి గొప్ప నాయకులు కూడా కేసీఆర్‌ను 'కారణజన్ముడు' అని ప్రశంసించారని తెలిపారు. ప్రస్తుతం పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై అభాండాలు వేస్తోందని ఆయన విమర్శించారు.కరోనా సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా కేసీఆర్ నాయకత్వంలో ఒక్క సంక్షేమ పథకం కూడా ఆగలేదని గుర్తు చేసుకున్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, పెన్షన్లు, ధాన్యం కొనుగోలు వంటి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాయని, హైదరాబాద్‌లో రోడ్లు కూడా వేశామని తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు ఉండబట్టే ఆదాయం లేకున్నా సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళగలిగామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, "అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్నట్టు ఇప్పుడు రాష్ట్రంలో ఆదాయం, అద్భుతమైన ప్లాట్‌ఫామ్ ఉన్నా పాలన చేతకావడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదని, కేవలం డబ్బులు కూడబెట్టి ఢిల్లీకి పంపాలన్న ఆలోచన మాత్రమే ఉందని ఆరోపించారు. డబ్బులు కూడబెట్టుకొని ఢిల్లీకి మూటలు పంపాలన్న ఆలోచన తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన రేవంత్ రెడ్డికి లేదు. "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అన్న అపనమ్మకాన్ని పోగొట్టి, ఆడబిడ్డలు సర్కారు దవాఖానాల్లో కేసీఆర్ కిట్లు తీసుకొని పండంటి బిడ్డలకు జన్మనిచ్చిన సంగతి వాస్తవం కాదా అని అన్నారు.

# తెలంగాణను నెంబర్ 1గా నిలబెడతాం

మొదటి పేజీ తరువాయి

పథకంతో పేదల కళ్లలో కనిపించిన ఆనందం, ఆత్మగౌరవం శాశ్వతంగా గుర్తుంటుం ది. అలాగే ఈ ఏడాది జూలై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం.వరంగల్ వేదికగా 2022 మే 6 న ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు 20,616 కోట్ల రూపాయల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర సృష్టించాం. రైతుల విషయంలో ప్రభుత్వం రాజీ పడదు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేల చొప్పున జూన్ 16 న కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించాం. దేశంలోనే అత్యధిక పంట పండించే దిశగా తెలంగాణ రైతాంగాన్ని ప్రోత్సహించాం.

రాష్ట్ర వ్యాప్తంగా 7,178 కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేశాం. సన్నాలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. రాష్ట్రంలో 29 లక్షల పంపుసెట్లకు 16,691 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇవన్నీ రైతుల పట్ల, వ్యవసాయం పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగరాసి అన్నదాతల సంక్షేమానికి రూ. 1 లక్ష 13 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం.పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం 22,500 కోట్లను వెచ్చిస్తున్నాం.ఎంతో శ్రమకోర్చి శాస్త్రీయమైన, ఎంతో లోతైన కసరత్తు చేసి సామాజిక తెలంగాణ సాధన కోసం స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ద్వారా ఆమోదించాం. ఆ బిల్లులను కేంద్ర ప్రభుత్వం సత్వరం ఆమోదించాలని కోరుతున్నాం. అలాగే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం. సామాజిక తెలంగాణకు పునాది వేసిన రోజు ఫిబ్రవరి 4 వ తేదీని తెలంగాణ సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని నిర్ణయించాం.

రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం కోటి మంది కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అత్యంత పారదర్శకతతో, వివాదర హితంగా వివిధ పరీక్షలు నిర్వహించి 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్షలాది ఉద్యోగ అవకాశాలను కల్పించాం. యువత మాదక ద్రవ్యాల భారిన పడి జీవితాలను నాశనం చేసుకోకుండా వాటిని కఠినంగా అణిచి వేస్తున్నాం.చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే ప్రణాళికలతో ప్రాజెక్టులకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందు కు వెళుతున్నాం. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల సాధనలో రాజీ పడబోం. హైదరా బాద్‌లో హైడ్రాను ఏర్పాటు చేసిన తర్వాత 13 పార్కులను, 20 చెరువులను ఆక్రమణల నుంచి రక్షించింది. 30 వేల కోట్ల విలువ కలిగిన ప్రభుత్వ భూములను కాపాడగలిగింది. తెలంగాణ బలం హైదరాబాద్. ఆ బలాన్ని మరింత బ్రాండింగ్ చేయడానికి పలు అంతర్జాతీయ ఈవెంట్లను నిర్వహించాం. మిస్ వరల్డ్, వరల్డ్ గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సదస్సు, గ్లోబల్ రైస్ సమ్మిట్, బయో ఏషియా సదస్సు వంటివి నిర్వహించాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మార్చుకుంటున్నాం. శాంతి భద్రతలు రాష్ట్ర ప్రగతికి కీలక పాత్ర పోషిస్తాయి. తెలం గాణ అనేక అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచి అత్యంత ప్రశాంత నగరంగా గుర్తింపు పొందుతుందంటే పోలీసు వ్యవస్థ కారణం. వారికి అభినందనలు. తెలంగాణ పోలీసులకు దేశంలోనే ది బెస్ట్ అనే పేరుంది.అన్ని వేదికల నుంచి తెలంగాణ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేశాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈ ఏడాది డిసెంబర్ లో ఆవిష్కరించబోతున్నామన్నారు.

## డీజీపీ జితేందర్‌కు మాతృవియోగం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కృష్ణ గోయెల్ (85) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆమె.. హైదరాబాద్ అపోలో దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం మహాప్రస్థానంలో కృష్ణగోయెల్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీజీపీ మాతృమూర్తి మృతి పట్ల బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జితేందర్ కుటుంబానికి ఇది తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

## రాజ్‌భవన్‌లో ఎట్ హెూంకు హాజరైన సీఎం రేవంత్

**బలగం టీవీ, హైదరాబాద్**



: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో 'ఎట్ హెూం' కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందుకు సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన వారి వద్దకు వెళ్లి గవర్నర్, సిఎం పలకరిం చారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రంలోని ప్రముఖులను గవర్నర్ రాజ్‌భవన్‌కు ఆహ్వానించి తేనీటి విందు ఇవ్వడం ఆన వాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకులు, ప్రముఖులు రాజ్‌భవన్‌కు వచ్చారు. వీరందరికి తగిన ఏర్పాట్లు చేశారు. రాజ కీయ నేతలు రానున్న నేపథ్యంలో రాజ్‌భవన్ దారిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ప్రజలందరికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు.



## మోడల్ స్కూల్ విద్యార్థికి కలెక్టర్ చేతుల మీదుగా పారితోషికం అందజేత..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో 2024-25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ లో బాలుర విభాగంలో జిల్లాలోనే రెండవ స్థానం నిలిచిన రహింఖాన్ పేట్ కళాశాల విద్యార్థి గుర్రం రాజశేఖర్ కు కలెక్టర్ చేతుల మీదుగా పది వేలు పారితోషికం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగాధర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇలాంటి బహుమతులు పిల్లల్లో స్ఫూర్తిని నింపగలవని తెలిపారు. ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , జిల్లా ఎస్పీ, కళాశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## సహకార సంఘం భవనంపై జాతీయ జెండా ఆవిష్కరణ..

**బలగం టీవి, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం (%్రూజు%) భవనంపై స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేశారు. సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది, ఇతర సభ్యులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా జెండా ఆవిష్కరణ..

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షులు గుండారపు క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్ కమిటీ సభ్యులు బాణాపురం రంగారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షురాలు మడుపు ప్రమోదరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగు మామిడి కృష్ణారెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, మహిళా సంయుక్త కార్యదర్శి దుంద్ర జలజా రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మంద బాల్ రెడ్డి, కోశాధికారి ఏడమల హనుమంత రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మడుపు ప్రేమ్ సాగర్ రెడ్డి, కంకణాల శ్రీనివాస్ రెడ్డి, కంది భాస్కర్ రెడ్డి, జిల్లా రెడ్డి యూత్ అధ్యక్షులు ఏడమల భూపాల్ రెడ్డి, తంగళ్ళపల్లి మండల రెడ్డి సంఘం అధ్యక్షులు వేసి రెడ్డి రామిరెడ్డి, సీనియర్ నాయకులు ఉప్పల లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, పన్యాల ఎల్లారెడ్డి, దుంద్ర విట్టల్ రెడ్డి, దోర్నాల జనార్దన్ రెడ్డి, మరియు యూత్ నాయకులు గూడ విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజ..

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**



తంగళ్ళపల్లి మండలం పద్మానగర్ గ్రామంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ పూజ నిర్వహించారు.

# దేశ సేవకు పునరంకితం కావాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దేశసేవకు పునరంకితం కావాలన్నారు. స్వాతంత్ర పోరాటాన్ని గుర్తు చేసుకోవడం, భారతదేశానికి స్వేచ్ఛ కల్పించిన త్యాగధనులను స్మరించుకోడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసు అధికారులు జాతి సమగ్రత, సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ఎందరో మహానుభావులు త్యాగఫలమే ఈరోజు మనందరం స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవిస్తున్నామని తెలిపారు. మహానుభావుల త్యాగాలను నిరంతరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు, ఆర్.ఐలు, ఎస్.ఐ లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన జిల్లా పోలీస్ అధికారులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ శాఖలో విశేషమైన సేవలందించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు ఎంపిక అయిన జిల్లా పోలీస్ అధికారులకు పతకాలు అందజేసి అభినందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.



**సేవ పతకాలు అందుకున్న అధికారులు..**

ఎల్.యాదగిరి, రిజర్వ్ ఇన్స్పెక్టర్, రాజన్న సిరిసిల్ల.
సత్యనారాయణ ARSI, DAR రాజన్న సిరిసిల్ల జిల్లా.
రవీందర్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్, బోయినపల్లి పోలీస్ స్టేషన్ ,రాజన్న సిరిసిల్ల జిల్లా.
శ్రీనివాస్,రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్, DAR, రాజన్న సిరిసిల్ల జిల్లా.
సాయి మహేష్, కానిస్టేబుల్, DAR, రాజన్న సిరిసిల్ల జిల్లా.
రవి, ARSI, DAR రాజన్న సిరిసిల్ల జిల్లా.
బాలు, హెడ్ కానిస్టేబుల్, DAR,రాజన్న సిరిసిల్ల జిల్లా.
రవీందర్, హెడ్ కానిస్టేబుల్, DAR, రాజన్న సిరిసిల్ల జిల్లా.
రాజేంద్రప్రసాద్, హెడ్ కానిస్టేబుల్, DAR, రాజన్న సిరిసిల్ల జిల్లా.
సత్యనారాయణ , హెడ్ కానిస్టేబుల్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా.
ప్రకాష్ ,హెడ్ కానిస్టేబుల్ బోయినపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా.



## సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ..

**బలగం టీవీ, సిరిసిల్ల**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ మాట్లాడుతూ, ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

**బలగం టీవీ, బోయినిపల్లి**

బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ శ్రీ రేణుక మాత గౌడ సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం రోజున సమావేశం ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాగుల ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షులు నేరెళ్ల అనిల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉయ్యాల తిరుపతి గౌడ్, కోశాధికారి ఉయ్యాల బాలాజీ గౌడ్, కార్యదర్శి జాగిరి లక్ష్మీపతి గౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నుకున్నందుకు ప్రతి సభ్యునికి, కుల బాంధవులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# 17వ పోలీస్ బెటాలియన్‌లో జెండా ఆవిష్కరణ

- ఉత్తమ సేవా పథకాల ప్రదానం..

**బలగం టీవీ, 17వ పోలీస్ బెటాలియన్, సర్దాపూర్**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా లోని 17వ పోలీస్ బెటాలియన్ సర్దాపూర్ నందు బెటాలియన్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్ జాతీయ జెండా ఎగురవేసి పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎం.ఐ. సురేష్ మాట్లాడుతూ.. ఈ రోజు మనమందరం 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషముగావుంది. స్వాతంత్ర్య దినోత్సవం అనేది మనల్ని, మన చరిత్రతో అనుసంధానించే ఒక అందమైన సందర్భం. మనం పీల్చే స్వేచ్ఛ వాయువుల వెనక ఎంతోమంది ప్రాణదానం ఉంది. మన స్వాతంత్ర్య దినోత్సవాన్ని చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించారు.

భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం మహాత్మ గాంధి, సుభాష్ చంద్ర బోస్, భగత్ సింగ్ లాంటి ఎందరో మహానుభావులు నేలకొరిగారు.. బ్రిటీషర్లతో అలుపెరుగని పోరాటంలో కనుమరుగయ్యారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 15న భారతదేశం 200 సంవత్సరాల బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి పొందింది. స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంది. స్వాతంత్ర్య



సమరయోధుల అపారమైన ధైర్యసాహసాలు, త్యాగాలే బ్రిటీష్ వారిని గద్దె దించి దేశాన్ని విముక్తం చేశాయి అని తెలియజేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిలో ARSI లు జాకబ్ రమేష్ లకు ఉత్తమ సేవా పథకంలు అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇ. ప్రమీల, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# దులీప్ ట్రోఫీ బరిలోకి టీమిండియా స్టార్‌లు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటనను విజయవంతంగా ముగించిన టీమిండియా, ఆసియా కప్ 2025కి ముందు దేశవాళీ సీజన్ ఆరంభ టోర్నీ దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగనుంది. ఆగస్టు 28న ప్రారంభమయ్యే ఈ టోర్నీ జోనల్ ఫార్మాట్‌లో జరుగనుంది.

సౌత్, నార్త్, వెస్ట్, ఈస్ట్, సెంట్రల్, నార్త్ ఈస్ట్ జోన్లుగా ఆరు జట్లు తలపడతాయి. గత ఏడాది ఫైనలిస్టులు సౌత్ జోన్ (కెప్టెన్ తిలక్ వర్మ), వెస్ట్ జోన్ (కెప్టెన్ ఇషాన్ కిషన్) నేరుగా సెమీస్‌లో ఆడనున్నారు.

మిగతా నాలుగు జట్లు అయిన సెంట్రల్, ఈస్ట్, నార్త్, నార్త్ ఈస్ట్ జోన్స్ క్వార్టర్ ఫైనల్ రౌండ్ ఆడుతాయి. ఇందులోని రెండు జట్లు సెమీఫైనల్-2కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడుతాయి. సౌత్ జోన్‌కు తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. వెస్ట్ జోన్‌కు ఇషాన్ కిషన్ సారథ్యం వహించనున్నాడు. వెస్ట్ జోన్‌కు శార్దూల్ ఠాకూర్, నార్త్ జోన్‌కు శుభ్‌మన్ గిల్, సెంట్రల్ జోన్‌కు ధ్రువ్ జురెల్, నార్త్ ఈస్ట్ జోన్‌కు జోనాథన్ రోంగ్సెన్ సారథ్యం వహించనున్నారు. ఆసియా కప్ 2025 ఎంపికయ్యే ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ సెమీస్, ఫైనల్ మ్యాచ్‌కు దూరమవుతారు. మ్యాచ్‌లు అన్నీ భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్నాయి.

ఈ టోర్నీలో శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, మహ్మద్ షమీ వంటి ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. ఆసియా కప్ కోసం ఎంపికైన ఆటగాళ్లు సెమీస్, ఫైనల్ నుంచి తప్పుకుంటారు.

పూర్తి షెడ్యూల్

క్వార్టర్-ఫైనల్ 1: ఆగస్టు 28-31, 2025: నార్త్ జోన్ ఈస్ట్ జోన్

క్వార్టర్-ఫైనల్ 2: ఆగస్టు 28-31, 2025: సెంట్రల్ జోన్ నార్త్ ఈస్ట్ జోన్

సెమీ-ఫైనల్ 1: సెప్టెంబర్ 4-7, 2025: సౌత్ జోన్ క్వార్టర్-ఫైనల్ 1 విజేత

సెమీ-ఫైనల్ 2: సెప్టెంబర్ 4-7, 2025: నార్త్ జోన్ క్వార్టర్-ఫైనల్ 2 విజేత

ఫైనల్: సెప్టెంబర్ 11-15, 2025: సెమీ-ఫైనల్ 1 విజేత సెమీ-ఫైనల్ 2 విజేత

దులీప్ ట్రోఫీకి స్పోర్ట్స్ 18 ఛానెల్, జియో హాట్‌స్టార్ అధికారిక బ్రాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తున్నాయి. స్పోర్ట్స్ 18 ఛానెల్‌తో పాటు జియో హాట్ స్టార్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. ఫ్రీగా చూడాలంటే జియో యూజర్లు 5జీ నెట్ వర్క్ ప్లాన్స్‌ను రిఛార్జ్ చేసుకుంటే హాట్‌స్టార్ ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ లభిస్తోంది.



## వెంకటేశ్ త్రివిక్రమ్ చిత్రం ప్రారంభం


**బలగం టీవీ, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్ - మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో సినిమా రానుంది. వెంకీ77 పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ ఏడాది ప్రారంభంలో 'సంక్రాంతికి వస్తున్నాం'తో విజయాన్ని అందుకున్న వెంకటేశ్ తన 77వ సినిమాను ప్రత్యేక ప్రాజెక్ట్‌గా అభివర్ణించారు. త్రివిక్రమ్- వెంకటేశ్‌ల కాంబో ఇది తొలిసారి డైరెక్టర్ స్థాయిలో కలిసింది. ఇంతకు ముందు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా మాత్రమే పనిచేశారు. ఈసారి మాత్రం దర్శకత్వం వహిస్తున్నారు. రెండు హీరోయిన్లతో ఈ కథ నడుస్తుందని, త్రిష, నిధి అగర్వాల్, రుక్మిణి వసంత్ పేర్లు వినిపిస్తున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రం, ఆ బ్యానర్‌లో త్రివిక్రమ్‌కు ఎనిమిదో చిత్రం కానుంది. వచ్చే నెలలో షూటింగ్ ప్రారంభమై 2026 వేసవిలో విడుదల చేయాలని యూనిట్ భావిస్తోందని తెలిసింది. వెంకటేశ్ తదుపరి ప్రాజెక్టులలో చిరంజీవి అనిల్ రావిపూడి 'మెగా 157'లో గెస్ట్ రోల్, 'దృశ్యం 3'లో థ్రిల్లింగ్ రీ-ఎంట్రీ, అలాగే మరో స్టార్ హీరోతో కొత్త సినిమా కూడా ఉన్నట్టు సమాచారం.

## సన్నీ డియోల్ 'బోర్డర్ 2' ఫస్ట్ లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

'గదర్ 2'తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్, మరో భారీ సీక్వెల్‌తో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న బోర్డర్ 2లో ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి, సోనం బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షఉటింగ్ జరుపుకుంటోంది. వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చిత్ర యూనిట్ ఈరోజు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. గన్ పట్టుకుని శత్రువులపై కాల్పులు జరుపుతున్న సన్నీ డియోల్ యాక్షన్ లుక్ పోస్టర్‌లో ఆకట్టుకుంది. "మళ్లీ ఒకసారి మన హిందుస్థాన్ కోసం పోరాడదాం" అంటూ సన్నీ డియోల్ ఈ పోస్టర్‌కు క్యాప్షన్ ఇచ్చారు.







## 'కిష్కిందపురి' టీజర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం కిష్కిందపురి. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగళ్ళపాటి దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మాణం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షఉటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలోని 'ఉండిపోవే నాతోనే' ఫస్ట్ సింగిల్‌ను ఇటీవలే విడుదల చేయగా, మంచి స్పందన దక్కింది. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. "సువర్ణమాయ రేడియో స్టేషన్... ఆకాశవాణి తలుపులు తెరుచుకున్నాయి" వంటి డైలాగ్‌లతో స్టార్ట్ అయిన ఈ టీజర్ హారర్ థ్రిల్లర్‌గా సినిమాపై ఆసక్తిని పెంచింది.



## మహేష్-రాజమౌళి సెట్స్ ఫొటో హల్‌చల్

**బలగం టీవీ, హైదరాబాద్**

దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్ వేగంగా సాగుతోంది. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా సెట్స్ నుంచి ఒక ఫొటో బయటకు వచ్చింది. అందులో మహేష్ బాబుతో పాటు బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా ఉన్నారు. ఈ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక చిత్రబృందం ప్రకారం, ఈ ఏడాది నవంబర్‌లో గ్లోబ్ ట్రాటర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నారు. ఇది మహేష్-రాజమౌళి కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా సినిమా ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## మొదటి రోజే చరిత్ర సృష్టించిన 'కూలీ'

**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన తాజా చిత్రం కూలీ తమిళ సినీ చరిత్రలోనే రికార్డు స్థాయి ఓపెనింగ్స్‌తో సంచలనాన్ని సృష్టించింది. ఆగస్ట్ 14న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం, విడుదలైన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.151 కోట్ల వసూళు సాధించి ఆల్‌టైమ్ రికార్డును కొట్టింది. ఇదివరకు విజయ్ దళపతి లియో (రూ.148.5 కోట్లు) దక్కించుకున్న "తొలి రోజు అత్యధిక వసూళ్లు" రికార్డును కూలీ అధిగమించింది. ప్రత్యేకంగా రజనీకాంత్ కెరీర్‌లో ఇదే మొదటిసారి డే 1 కలెక్షన్లు రూ. 150 కోట్ల మార్క్ దాటాయి. ఈ విజయంతో రజనీ 50 ఏళ్ల సినీ ప్రయాణంలో కొత్త మైలురాయిని అందుకున్నారు. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం, రానున్న కొన్నేళ్లలో కూలీ తొలి రోజు రికార్డును


## జగపతిబాబు అసలు పేరు....

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ నటుడు జగపతిబాబు ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది చిత్రంలో నటిస్తున్నారు. మరోవైపు ఆయన యాంకర్‌గా వ్యవహరించే జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షో ఆగస్ట్ 17 నుంచి టీవీలో ప్రసారం కానుంది. తాజాగా యూట్యూబ్‌లో విడుదల చేసిన వీడియోలో జగపతిబాబు తన అసలు పేరు 'జగపతిరావు' అని, కానీ సినీ ఇండస్ట్రీలో 'రావు' పేర్లు ఎక్కువ కావడంతో 'జగపతిబాబు'గా మార్చారని తెలిపారు. అందరికీ సులభంగా పలకడానికి 'జగ్గూభాయ్'గా మారిపోయానని నవ్వుతూ చెప్పారు. తన కెరీర్‌లో మరపురాని అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, అంతఃపురం సినిమా క్లైమాక్స్ సీన్‌లో డైరెక్టర్ కృష్ణవంశీ సీన్‌లో లీనమై 'కట్' చెప్పకపోవడంతో తాను నిజంగానే చనిపోయానని అనుకున్నానని వెల్లడించారు. అదే తన కెరీర్‌లో ఫేవరెట్ షాట్ అని పేర్కొన్నారు.

## కృష్ణావతారంపై చారిత్రక చిత్రం

**బలగం టీవీ, హైదరాబాద్**




అభయ్ చరణ్ ఫౌండేషన్, శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా ఒక మహత్తర చారిత్రక మహాకావ్యాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఈ చిత్రానికి "శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా" అనే టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అనిల్ వ్యాస్ నిర్వహణలో, ముకుంద్ పాండే కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, ఇస్కాన్ ఢిల్లీకి చెందిన సీనియర్ ప్రీచర్ జితామిత్ర ప్రభు శ్రీ ఆశీస్సులతో రూపుదిద్దుకుంటోంది. 11-12వ శతాబ్దాల మహోబా సాంస్కృతిక వైభవాన్ని, భగవాన్ శ్రీకృష్ణుడి దివ్యత్వం, ధైర్యం, ఆధ్యాత్మిక ప్రభావాన్ని ఆవిష్కరించనుంది. సినీ పరిశ్రమలో తొలిసారిగా శ్రీకృష్ణుడిని యుద్ధవీరుడి పాత్రలో చూపించబోతున్న ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కుతోంది. చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను సమ్మిళితం చేస్తూ, ప్రపంచస్థాయి టెక్నీషియన్లతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.